# ముప్పయి - నిమిషాలు
## (Thirty Minutes)

'సి-డబ్ల్యూ' టోపిని సర్దుకున్నాడు - చక్రధర్.

"సి-అంటే కానివిక్ట్. 'డబ్ల్యూ' అంటే వార్డర్. అంటే యావత్ జీవ ఖైదీ. యావజ్జీవ జైలు శిక్ష అనుభవించవలసిన నేరస్థుడు. యావజ్జీవం అంటే పద్నాలుగు సంవత్సరాలు. చక్రధర్, తాను చేసిన జంట హత్యలను నిర్భయంగా ఒప్పుకొన్న ధీరోధాత్తుడు.

"చక్రం....." మళ్ళీ పిలిచాడు జైలర్.

"అయ్...." అంటూ చక్రధర్ శరీరం, ఎటెన్షన్ భంగిమలో నిలబడ్డది. గోదావరి జిల్లాలలోని తెలుగు యాసతో కూడిన అతని మాటలు శ్రోతలకు పెద్ద ఎన్‌టర్‌టైన్‌మెంట్. రాజమండ్రి కారాగారంలో జైలు అధికారులకు ఎదురు తిరిగిన కారణంగా ప్రభుత్వం వరంగల్ "సెంట్రల్ ప్రిజన్"కు ట్రాన్స్‌ఫర్ చేసిన ఖైదీ.

తెల్లని ఖాదీ ప్యాంటు - తెల్లని బుష్‌షర్ట్ - తెల్లని టోపి - టోపికి కుడివైపున సి.డబ్ల్యూ ఇత్తడి బిళ్ళ పొదగబడింది. స్టార్ట్ హోటల్ సప్లయర్ లాగ చక్కని యూనిఫాం.

"మొత్తం చద్దర్‌లు (దుప్పట్లు) ముప్పయిరెండు... రిజిస్టర్‌లో ఈ రోజు తారీఖు మీద నెంబర్ ఏసినా... ఆ పని అయిపోయింది... ఇప్పుడేం చెయ్యమంటారు....?

"జెయిలర్ కూర్చున్న టేబుల్ ప్రక్కన చద్దర్ల కుప్పలు. జైలులోని ఖైదీలు లోపల మగ్గాలపై వేసిన రంగు రంగు దుప్పట్లు - జంపకానాలు - మొదలగు వాటిని మడిచి పెడ్తున్నారు. నేలపై కూర్చున్న మరో ఇద్దరు -

యావజ్జీవ ఖైదీలు. వారి చుట్టూ తెల్లరంగువి - సిరా రంగువి... గోధుమ రంగు గల చెద్దర్లు. ఖైదీల శ్రమ ఫలితం.

"వాటి లెక్క వీళ్లు చెబుతారుగానీ... నువ్వు - ఇంటర్వ్యూల కొచ్చినవాళ్ళను లోపలికి తీసుకొనిరావాలి... ఎరికేగదా?... బ్యారక్స్‌లోకి వెళ్లి ఎవ్వరెవ్వరి కోసం, ఎవరొచ్చారో వాళ్ళను పిలుచుకురావాలి. తెలిసిందా...?"

"అయ్యో బాబోయ్.... ఈయాల్ల సోమవారం కదండీ".... ముసిముసి నవ్వులతో మూలనున్న తన లాఠీ చేతిలోకి తీసుకున్నాడు.

ఆ రోజు సోమవారం

జైలు ఆవరణంతా కళకళలాడుతోంది - పెళ్ళి ఇల్లులా. 'సందడి, సందడిగా' ఉంది. జైలులో మగ్గుతూన్న తమ ఆత్మీయులను చూడటానికి, తల్లిదండ్రులు, భార్యా పిల్లలు, బంధువులు - జైలు బయట పడిగాపులు కాస్తున్నారు. వాళ్ళ వాళ్ళ పేర్లను, బాంధవ్యపు వివరాలను నమోదు చేసిన చిట్టీలను లోపలికి పంపిస్తున్నారు. లోనికి వచ్చిన ఆ దరఖాస్తులను, జైలర్ పరీక్షించి, పరిశీలించి రిజిస్టర్‌లో ఎంట్రీ చేసుకుంటున్నాడు.

"పదింటికి ఇంటర్వ్యూలు... పది గంటలయినాంక, ఒక్కొక్కరినే తోలుకరావాలి. ముందుగా రామరాజు గారిని రమ్మని చెప్పు... ఇప్పుడే పోయి ఇంటర్వ్యూకి "రెడీ" కమ్మని చెప్పు.... మనుసున పట్టిందా?

"రామరాజుగారంటే ఆయనేగదండీ... నాకులాగా దొడ్డుకు దొడ్డు ఉంటాడు?

ఆ మాటలకు జైలర్ పగలబడి నవ్వాడు. అంతలోనే ఫోన్ గణగణ మ్రోగింది. జైలర్ రిసీవర్ ఎత్తి చెవి వద్ద పెట్టుకొని.... "యస్ సార్, యస్ సార్.... కొత్తగా వస్తూన్న డిటెన్యూల కొరకు అరెంజ్‌మెంట్స్ చేస్తున్నాం సార్... గార్డెన్ వర్క్ బంద్ పెట్టాం సార్... ఈ రోజు...."

"మోకాళ్ళ వరకూ లాల్చి - పైజామా. వారు ప్రొద్దుపొడుపుతోనే లేచి మన ప్రహరీ గోడ ప్రక్కన కూర్చుని చదువుకుంటాడు. వారి ప్రక్కనే ఇంగ్లీషు అర్థాలు చూసుకునే ఇంత దొడ్డు పుస్తకం ఉంటది. ఎప్పుడూ.... ఆయనే శెక్రం..... ఎరికైందా?

క్రింద కూర్చుని చద్దర్లు మడుస్తూన్న ఆ ఇద్దరూ యావజ్జీవ ఖైదీలు గుర్తులు చెప్పి చక్రధర్ సందేహం తీర్చారు.

ఫోన్‌లో సంభాషణ ఇంకా కొనసాగుతూనే ఉంది. జైలర్ నిలబడి వినయం ఉట్టిపడుతున్న గొంతుతో... "మన జైలులో మాగ్జిమమ్ 600 మందికి మాత్రమే ఎకమడేషన్ ఉంది సార్.... ఇప్పటికే 7 వందలు దాటిపోయారు.... ఆర్డినరీ కాన్విక్ట్స్ ప్లస్ పొలిటికల్ డిటెన్యూస్ కలిపి. కొత్త డిటెన్యూస్‌ని లాస్ట్ బ్యారక్‌లో.... అంతే సార్... అంతే సార్... "యస్ సార్" అంటూ ఫోన్ పెట్టేశాడు.

చక్రధర్ వంక చూస్తూ "ఇంకా ఇక్కడే వున్నావా? జెల్దిపో... అన్నాడు"

"కొత్త డిటెన్యూలు ఇంకావస్తూన్నారండీ?.... చక్రధర్ సందేహం.

"అన్నీ.... నీకే కావాలి చక్రం.... ముందు చెప్పిన పని చెయి...."

లాఠీ కాలిపై చిన్నగా, లయబద్ధంగా, దరువేసుకుంటూ చక్రధర్ నిష్క్రమించాడు....

......

రాజప్రసాదానికి చుట్టూ ఉన్న ఎత్తైన గోడలా, జైలు చుట్టూ ఎత్తైన గోడ. ఆ గోడలో నాల్గు దిక్కుల్లో నాలుగు బురుజులు. ఆ బురుజుల్లో పహారా కాస్తున్న సెంట్రీ పోలీసులు. అటువంటి ఒక బురుజు నీడలో తలవంచుకొని చదువుకుంటూన్న డిటెన్యూ రామరాజు. అతని ఏకగ్రాతను భగ్నం చేయటం ఇష్టం లేక చక్రధర్ మౌనంగా నిలబడ్డాడు. మనిషి అలికిడి విని తలపైకి ఎత్తాడు.... అతను.

"వ్వాట్... చెక్రం - వ్వాట్ న్యూజ్...."

"అయ్యో బాబోయ్... మీరు ఇంగిలీసులో అడిగితే నాకేమి తెలుస్తుందండీ...." పగలబడి నవ్వుతూ ఎందుకొచ్చావని అడుగుచున్నారా?.... అన్నాడు.

"యస్".... అంటూ కళ్ళద్దాలు తీసుకొని, కనుబొమ్మలను ఎగురవేశాడు.

"మీకు చాలా సంతోషకరమైన కబురు తెచ్చాను... దాన్ని చెప్పాలంటే ముందు నాకు "టిఫిన్" పెట్టమని వెంకన్నకు చెప్పండి.... ఇయ్యాల సోమారంకదండీ... మీ మెస్‌లో పూరీలు....."

"కావచ్చు... నేనింకా తినలేదు. నేను చెప్పానని చెప్పి తినిరా... ఇంతలోకీ ఈ చాప్టర్ - అయిపోతది".... కళ్ళద్దాలు ముక్కుపైకి ఎక్కించి, చేతితో గడ్డం రుద్దుకోసాగాడు. గడ్డం బాగా పెరిగింది.

మూడు వారాల గడ్డం. సూదుల్లాపొడుచుకువస్తున్న వెంట్రుకలను గీక్కుంటూ....." "మాకు సంతోషమైన కబుర్లే ముంటాయ్.... విడుదల చేయటం మినహా.... అది ఇంతలో జరిగే పని కాదు.... ఎవరైనా ఇంటర్వ్యూకు వచ్చారా?...."

"అయ్... అవునండి.... జెయిలర్ గారు మిమ్ములను పదింటికల్లా "రెడీ"గా ఉండమన్నారు".....

"ఎవరు వచ్చింది? నీకేమైనా తెలుసా?"

"నాకు జెయిలర్ పేర్లు సెప్పరు గదాండీ.... బహుశా "అమ్మ" గారు, అయిఉంటారండీ!

ఆ మాట వినగానే అతని ముఖంలో చిరునవ్వు మెరిసింది. కాని వెంటనే అంతర్ధానమైంది.

"స్విచ్" వేసిన వెంటనే ఉజ్వలంగా వెలిగిన "బల్బు" హై ఓల్టేజి కారణంగా "టప్" మని మాడిపోయినట్లు అతని ముఖం కాంతివిహీనం అయిపోయింది. పుస్తకంలో ముగించవల్సిన చాప్టర్ మూత పడింది. పుస్తకాలు చంకలో పెట్టుకొని లేచి నిలబడ్డాడు. తిమ్మిరి పట్టిన కాళ్ళలో రక్తం ప్రవహించే వరకు నిలబడి భార్యను గురించి ఆలోచిస్తూ మెల్లగా రూమ్‌కు చేరి మంచంపై అడ్డంగా పడుకున్నాడు.

భార్యను గురించిన కవితాత్మక ప్రతీకలు మనసులో తిరుగసాగాయి.

ఆమె....

ఆమె.... తల వంచుకొని, తాళి కట్టించుకొని తన జీవిత క్రీడలో తనతో జట్టు కట్టిన..... కో, ప్లేయర్.

తన జీవితపు క్రీడాస్థలిలో, తన వెనుక నిలబడి, ఎప్పుడూ "ఫౌల్, ఫౌల్" అంటూ "విజిల్" వేసే "రిఫరీ".

"పక్కఇంటి అన్నయ్యగార్ని చూసి నేర్చుకోండి..." అంటూ నేపథ్యగానం వినిపించే ప్లేబాక్ సింగర్.

"ఈడెన్ గార్డన్"లో "ఫర్బిడెన్ ట్రీ" నుండి పండుతినమని" "ఆడమ్సను" ప్రోత్సహించిన "ఈవ్ స్ఫురణంకొచ్చింది. బాలగంగాధర్ తిలక్ కవితలో 'తల్లీ... చెలీ.... నెచ్చెలీ...." నన్ను కౌగిలించుకొన్న బెబ్బులీ...." అన్న మాటలు తన మనసులో తళుక్కున మెరిసాయి.

ఆలోచలతో సతమతమౌతూ, లేచి గడ్డానికి క్రీమ్ పూసి బ్రష్ చేసి, గడ్డం గీయసాగాడు.

"టక్"... రేజర్ ఆగిపోయింది.... తెగింది. రక్తం చుక్కలు చుక్కలుగా రక్తం. ఓరినీయవ్వ ఆలోచనలో పడి గాటుపెట్టు కుంటినే.... డెటాల్ చుక్క"

"భార్యకు ఇంతఘనం భయపడకూడదు. ఏం చేస్తది? కాకపోతే ఏడుస్తది. ఆ ఏడుపులో కొట్టుకుపోకుండా జాగ్రత్త పడాలి... ఆమెను ఎడ్యుకేట్ చెయ్యాలి. ఎడ్యుకేట్ చెయ్యకపోవటం తన తప్పు... చూద్దాం...

అనుకుంటూ గడ్డం ముగించి పౌడర్ పూసుకున్నాడు. అద్దంలో చూసుకొని ముఖానికి లేని చిరునవ్వు పులుముకున్నాడు.

తాను జెళ్ళో సంతోషంగా వున్నట్లు నటించాలి. జీవితంలో జీవించటం కాదు ముఖ్యం. నటించటం ముఖ్యం. నటన రాని వాడు జీవితంలో ఒక మిజరబుల్ ఫెయిల్యూర్. తాను కొడుకుగా, భర్తగా, తండ్రిగా తన పాత్రలు నిర్వహించాలి. ఈ నిర్వహణకు కావల్సిన హావభావాలను సమకూర్చుకొని నటించాలి".

మహనీయులు షేక్స్పియర్ గొప్పగా చెప్పాడు. "జీవితం ఒక రంగస్థలం అని మానవులందరూ పాత్రధారులని.... "ఏ గ్రేట్సోల్"... అని ఆలోచించుకుటూ లాల్చీ పైజామా... తగిలించుకొని గడియారం వంక చూశాడు. ఇంకా "టైం" ఉంది.... ఇంక టైం ఉంది ఇంటర్వ్యూకి. పది గంటలకు కదా!... అంటూ న్యూస్ పేపర్ కళ్ళముందు పెట్టుకున్నాడు.

"ది రైజింగ్" సన్ ఆఫ్ ఇండియా" (మొదటి హెడ్ లైన్స్.)

సంజయ్ గాంధి ఫోటో.... యువజన కాంగ్రెస్ నేతపై పొగడ్తలు. నెక్స్టట్ ఐటమ్....

శీర్షిక... "అత్యవసర పరిస్థితి.... ప్రజాస్వామ్యంలో అను శాసన పర్వం" - వినోభాభావే, సమర్థన.

మూడవ శీర్షిక.... "ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ ఒక పెద్ద మలుపు".... అరిగిపోయిన గ్రామ ఫోన్ రికార్డు. "హిజ్ మాస్టర్స్ వాయిస్" వింటూన్న పెంపుడు కుక్కలాంటి భజన పార్టీ మద్ధతు.

పేపరు విసిరి అవతల పారేశాడు. గోడ గడియారంలో "టింగ్" అన్న శబ్దం. అర్ధగంట సూచన.

"ఇంకా అర్ధగంట.... "హౌవుటు..... కిల్.... ది టైం" అనుకుంటూ ఇతర డిటెన్యూలున్న హాల్స్‌వైపు నడిచాడు.

"గడ్డం తీసివేసి, పొద్దు పొద్దున్నే "స్మార్ట్‌గా" తయారయ్యారు.... రాజుగారూ.... ఏమిటి విశేషం?

చెప్పాడు.

"గుడ్‌లక్".... అన్నారు. మిత్రులు.... శ్రేయోభిలాషులు.

తమకు ఇంకా భార్య పిల్లలను చూసే భాగ్యం కలుగలేదని", వాపొయ్యారు కొందరు నిరాశావాదులు. పది గంటలు అయింది. వార్డర్ వచ్చి ఎదురుగ్గా నిలబడ్డాడు "గేటులోకి రమ్మని".

.........

మెయిన్ గేట్ ప్రక్కనే జైలు సూపరింటెండెంట్ కార్యాలయం దాని ప్రక్కనే "జైలర్" ఆఫీస్. ఆ ఆఫీస్ వరండాలో టేబుల్. దానికి ఆనుకున్న కుర్చీలో "జైలర్". ఖాకీ యూనిఫామ్, భుజ కీర్తులు. హోదాను సూచిస్తూ ఇత్తడి బిళ్లలు.

ఆ టేబుల్‌కి దూరంగా చిన్న బెంచి. బెంచి ప్రక్కన కుర్చీ. ఆ కుర్చీలో సాధారణ దుస్తుల్లో ఉన్న ఇంటెలిజెన్స్ ఆఫీసర్. సి.ఐ.డి. శాఖకు చెందిన నిఘా విభాగపు ఆఫీసర్.

ప్రభుత్వ వ్యతిరేకమైన విషయాలు - ఉద్యమాలు - పార్టీలకు సంబంధించిన రహస్యాలను తమ తమ భార్యల ద్వారా, బంధువుల ద్వారా, బయటికి చేరవేయకుండా నిఘా. ఇంటర్వ్యూ జరుగు తున్నప్పుడు "నిఘా" విభాగపు అధికారులు, ఆ సంభాషణలు వినాలనీ, అనుమానస్పద వ్యక్తులపై నివేదికలు సమర్పించాలని ప్రభుత్వ ఆదేశం.

రామరాజు స్టూలుపై కూర్చున్నాడు... పరీక్ష హాలులో కూర్చున్న స్టూడెంట్‌లా.

రాజుగారూ?... "ఇంటర్వ్యూ... అఫ్ యాన్ అవర్.... ఓన్లీ... థర్టీ మినిట్స్.... ఓ కే. ఏమీ మాట్లాడదల్చుకున్నరో మీరు జల్దీ జల్దీ ఫినిష్ చెయ్యాలి. ఈ రోజు చాలా మంది వచ్చారు.

తల ఆడిస్తూ రామరాజు తన ఇంటర్వ్యూ కొరకు వస్తున్న వ్యక్తుల కొరకై గేట్‌లోకి చూశాడు.

ముందు తన భార్య, తరువాత తన చిన్న బిడ్డ. మూడు సంవత్సరాల బిడ్డ. తన బిడ్డ వెనుకల తన తమ్ముని కొడుకు నాల్గు సంవత్సరాల పసివాడు. వాళ్ళ వెనుక తన తల్లి... ప్లాస్టిక్ బుట్ట చేతిలో పట్టుకొని, వాళ్ళ వెనుక చక్రధర్... వాక్యానికి ఫుల్‌స్టాఫ్‌లాగా. తన తండ్రి రాలేదు.

తల్లి వెనుక నడుస్తూన్న తన చిన్న బిడ్డ, తనను అంత దూరం నుండే పోల్చుకుంది. స్టూలుపై నుండి లేచి నిలబడ్డాడు. తన బిడ్డ తన వైపు ఉరికిరాసాగింది. తనపై కేంద్రీకరించిన చూపులతో.

ఆ చిన్నారి కళ్ళనిండా పరుచుకున్న తండ్రి రూపం.

"నాన్న...

ఏదైన ఊరికి వెళ్ళి రాగానే తనను ఎత్తుకొని గాలిలోకి ఎగురవేసి పది నిమిషాలు చంకన వేసుకొని ఎత్తుకుతిప్పే నాన్న "అమ్మ కొట్టిందంటే".... అమ్మను తిట్టి కొట్టపోయే నాన్న. "బుజ్జీ.... ఇదిగో నీకు కొత్త పలక"ని తెచ్చిన నాన్న.

ఉరికి, ఉరికి, వచ్చి తండ్రి మెడను చుట్టుకుంది. బలంగా ముందుకు వంచి తండ్రి నొసలు ముద్దు పెట్టుకుంది.

అవధులు లేని ఆనందం. సంతోషంతో ఉబ్బితబ్బిపోయిన ఆ పసి వదనం వికసించింది. దానిమ్మ గింజల్లాంటి పలు వరుసతో నవ్వింది. ఆ నవ్వుల కాంతితో జైలర్ గది నిండిపోయింది.

"మన ఇంటికి పోదాం... రా..." చెయ్యిపట్టుకొని లాగసాగింది. "వెళదాం... వెళదాం" అంటు ప్రేమగా తల నిమిరాడు... ఆ చిన్నారి అమాయకపు కళ్ళలోకి చూస్తూ. "ముందు నువ్వు అక్కడకు వెళ్ళి పూలు తెంపుకో" అంటూ పూల చెట్ల వైపు వేలు చూపించాడు.

"మరి... ఈళ్ళు... ఈ పోలీసులు కొడితే?... అంటూ జైలర్ వంక వేలు చూపించింది.

"కొట్టరు... కొట్టరు.... వీళ్ళు మంచి పోలీసులు... "సాధారణ దుస్తుల్లో వున్న సి.ఐ.డి. ఇన్స్పెక్టర్ జైలర్ వంక చూసి పెద్దగా నవ్వాడు.

"చక్రం... ఈ బుజ్జమ్మను కొన్ని మల్లెపూలు తెంపుకోనివ్వు.... ఈ పువ్వులు... పిల్లల కోసమే.... ఇతనితో.... పో" ఖాకీ యూనీఫామ్‌లో ఉన్న జైలర్ అన్నాడు... విరగబూసి రాలిపోతున్న మల్లెచెట్ల వంక చూస్తూ.

రామరాజు తలపైకి ఎత్తి చూశాడు... గోడ మీద గడియారం కేసి.

పెద్ద ముల్లు రెండు అంకె మీద ఆగివుంది. పది నిమిషాలు ముగిసినాయి. ఇంకా ఇరువై నిమిషాలు మిగిలినవి. భార్య.... తల్లిపై అతని చూపులు నిలిచాయి.... భార్య ఒడిలో తన తమ్ముని కొడుకు.

ఆ బాబుని దగ్గరకు తీసుకొని ఎడమ చేతితో పొదవి పట్టుకొని, బుగ్గలు నిమిరి తన తొడపై కూర్చుండబెట్టుకొన్నాడు. పెద్దనాన్న తొడపై చేయి వేసిన ఆ పిల్లవాడి చూపులు... ఖాకీ బట్టలతో పిటపిటలాడుతున్న జైలర్‌పై సాధారణ బట్టలలో వున్న 'నిఘా' ఇన్స్పెక్టర్‌పై నిలిచాయి. పరిశీలనగా చూస్తున్న అతని చూపుల్లో ఎన్నో ఆలోచనలూ, సందేహాలు.

"ఏమిటిరా?... రెప్పకొట్టకుండా వాళ్లను చూస్తున్నావ్?... వాళ్ళు నిన్నేమి చెయ్యరులే... ఇటు తిరుగు... అంటూ ఆ పిల్లవాని ముఖం తనవైపు తిప్పుకున్నాడు.

గద్దముక్కులాగా కొస వంగిన పొడవాటి ముక్కు. కళ్ళు ఉద్విగ్నంగా మెరుస్తున్నాయి.

"పెదనాన్నా!... నువ్వు దొంగతనం చేశావా? పోలీసులు నిన్ను ఇక్కడకు ఎందుకు తీసుకొచ్చారు. మరి" .... దుఃఖంతో ముఖం బుస బుసా పొంగింది. బుగ్గలపై కన్నీరు కారసాగింది.

"ఆ చిన్నారి అడిగిన ప్రశ్నకు నిర్ఘాంత పోయిన జైలర్ అతనిని దగ్గరకు తీసుకొని లాలనగా అడిగాడు.

"నీ పేరు?"....?

"బలరామరాజు!"...?

"ఏం చదువుతున్నావ్"....?

"యు.కె.జి."....?

"మీ చెల్లి పేరు...? ఏం చదువుతుంది?"

"లక్ష్మి...

యల్.కె.జి. అంకుల్!.... మా పెద నాన్న దొంగతనం చేయలేదుకదా! మరి ఎందుకు విడిచిపెట్టవ్?"

"భలే... ఉషారున్నావ్... మీ పెదనాన్నను విడిచిపెట్టటానికి జర్ర టైం పడ్తది... తెలిసిందా?... నీవు కూడా పోయి మీ చెల్లితో పూలు తెంపుకో.... మీ పెద నాన్నను, మీ పెద్దమ్మతో, నాయనమ్మతో మాట్లాడనివ్వు.... ఇంటర్వ్యూ అయిపోయాక అందరూ వెళ్ళిపోవచ్చు" అంటూ జైలర్ మరొక వార్డర్‌ని ఇచ్చి బయటకు పంపించాడు.

"పదిహేను నిమిషాలు అయిపోయినై?... రాజుగారూ త్వర త్వరగా మాట్లాడండి. "అంటూ సి.ఐ.డి. ఆఫీసర్ బెంచికి దగ్గరగా తన కుర్చీ జరుపుకున్నాడు. అతను కుర్చీ దగ్గరగా లాక్కోవడం చూసి రాజుగారి భార్య కుంచించుకుపోయి, పమిట కొంగు భుజంపైకి లాక్కొని అవతలకు జరిగింది.

"ఇదేమి... ఇంటర్వ్యూలయ్యా?.... మనస్సు విప్పి మాట్లాడుకోకుండా ఈ రూల్స్ ఏమిటి? ఇంటర్వ్యూలు, లెవ్వని చెప్పితే సరిపోతది కదా!... ఇంటర్వ్యూ ఇచ్చినట్టే ఇచ్చి మాపై ఈ కాపలా ఎందుకు?.... చిరాకు పడుతూ ఆ ఆఫీసరును అడిగింది.

"అంతే మరి వాళ్ళు మాత్రం ఏమి చేస్తారు.... చెప్పు.... ప్రభుత్వాన్ని అడగాలి మనం... వాళ్ళ డ్యూటీ వాళ్ళది".... పోలీసుల తరుపున వకాల్తా పుచ్చుకొని సంజాయిషీ చెప్పాడు భర్త.

"ఆ మాట వాళ్ళు చెప్పాలి... మీకెందుకు?"... అది సరేగాని "ఎన్నాళ్ళుందామని ఈ జైల్లో".... సూటిగా ప్రశ్నించింది. అతని నెత్తిన పడిన తొలి పిడుగు. చలి పిడుగు.

ఉరుములు, మెరుపులు లేని ఆకాశం నుండి రాలిన పిడుగు.

"విడిచిపెట్టేవరకూ... జైల్లో ఉండాలని ఉంటారా ఏమిటి?... ఎవరైనా?" భార్య మనస్సును నొప్పించకుండ గొణుగుతున్నట్లు మెల్లగా అన్నాడు.

"మీ వాలకం చూస్తే ఉందామనే ఉన్నట్లున్నారు. అందరూ విడుదల కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటుంటే, నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారు జైల్లో.... మీకోసం ఏదైనా ప్రయత్నం చేద్దామంటే ముందు మీరే ఒప్పుకోరు. పార్టీకి రాజీనామా చేసి, రాజకీయాలకు దూరంగా ఉంటానని, ప్రభుత్వానికి ఒక హామీ పత్రం... మా అన్నయ్య వాళ్ళు హోం మినిస్టర్ దగ్గరకు వెళ్ళి ప్రయత్నిస్తారంట".

"ప్రభుత్వానికి సరెండర్‌కమ్మని... "అండర్ టేకింగ్" రాసివ్వమని అడగటానికి "ఇంటర్వ్యూ అనుమతి తీసుకుందని గ్రహించిన రాజు, మనసు కోపంతో రగిలిపోయింది.

"ఇవ్వను... ఇవ్వనంటే ఇవ్వను.... ఇజ్జత్ తక్కువ పనులు చెయ్యనని"... నిర్మొహమాటంగా చెప్పాలనుకొని చెప్పలేకపోయాడు. ఒకవేళ తను గట్టిగా ఆ మాటంటే ఆమె "గయ్"మని లేచి సీను క్రియేట్ చెయ్యవచ్చు. లేకపోతే కంటతడి పెట్టుకొని అసలే మాట్లాడకుండా బిగదీసుకొని పోవచ్చు... "ప్రో అండ్ కాన్సా ఆఫ్ ది స్విచ్‌వేషన్" అంచనా వేసి నిగ్రహం పాటించాడు... జైలు ఆవరణంలో ఆమెను ఏడిపించేలాగా రెచ్చగొట్టటం, తన సంస్కారహీనతకు నిదర్శనమౌతుందని ఆలోచించి, మౌనం పాటించి,.... ఆమె చూపులనుండి పక్కకు చూస్తూ"....

"ఈ జైల్లో... గులాబీలు.... మల్లె మొగ్గలు.... చేమంతులు... ఎన్నో పూస్తాయి. కాని వాటిని సిగలల్లో పెట్టుకునే ఆడవాళ్ళే లేరు" అన్నాడు.

"పువ్వులు గివ్వలని... టాపిక్‌ను "డిస్ట్రాక్ట్" చెయ్యకండి. ఇంతకు మీరు "అండర్ టేకింగ్" ఇస్తారా... ఇవ్వరా...? ఆన్సర్ టు ద కొశ్చన్ అన్న ధోరణిలో ప్రశ్నించింది. చేతిలో బెత్తం లేని టీచర్‌లాగ ఉంది భార్య.

"అదంతా మీ భ్రమ" "అండర్ టేకింగ్" ఇస్తే విడిచిపెడ్తారనుకోవటం పెద్ద పొరపాటు. ఆ విధంగా రాసిచ్చిన వాళ్ళను ఇంతవరకూ ఎవ్వరనీ విడిచిపెట్టలేదు.... తెలుసు గదా!... పై పెచ్చు, నా స్థాయి నాయకుడు రాసిస్తే న్యూస్ పేపర్‌లో... ఫోటోతో సహా వేసి పరువు తీస్తారు... ఇంత బతుకు బతికి ఇంటివెనుకాల చచ్చినట్లవుతుంది. నువ్వ కొంచం "కూల్"గా ఆలోచించు. ఇది నా ఆత్మగౌరవానికి ఎంత మచ్చ".

"ఎవరి వద్దకు వెళ్ళినా... అండర్ టేకింగ్ రాయించుకు రమ్మని అడిగే వాళ్ళే... పని అయితే అవుతుంది. లేకపోతే లేదు... ఇంతకూ మీరు రాసిస్తారా.... లేదా? లేచి నిలబడింది. కోపంగా.

రెండవ పిడుగు...

ఆకాశాన్ని, కోసుకుంటూ, తళతళా మెరిసిన మెరుపు వెనుక రాలిన పిడుగు.

స్థిత ప్రజ్ఞతతో చిరునవ్వుతో భార్య వంక చూశాడు.

ఆమె ఈ నెల రోజుల్లో చాలా బక్కచిక్కిపోయింది. మెడ సన్నగా మారి నల్లరంగు అలుముకుంది. తల దువ్వుకొని కొప్పు పెట్టుకుంది. కొప్పు పెట్టుకున్న సవరానికి నూనె రాసినట్లు లేదు. నల్లగా వున్న తల వెంట్రుకల పైన రాగి రంగుతో చుట్టుకున్న సవరం అసహ్యంగా వుంది. తొందరలో ఆమె ఆ విషయాన్ని గమనించినట్లు లేదు.

"కూర్చో... కూర్చో... నేను ఆలోచిస్తా.... పని అవుతుందంటే రాసిస్తా... మిమ్ములందరినీ ఏడిపించి, నేను బామ్ముకునేదేంటీ ఇక్కడ?".... అంటూ తల్లి వంక తిరిగాడు.

"అమ్మా... ఏమిటీ? కొడుక్కు బుట్టనిండా పండ్లు పట్టుకొచ్చినట్లున్నావ్.... ఇదేం... దవాఖానా (ఆసుపత్రి) కాదు కదా?... నాకు ఏం రోగం వచ్చిందని ఈ పండ్లు... నేను సలక్షణంగా వున్నానిక్కడ"

తల్లి కొడుకు కేసి పరీక్షగా చూసింది.

ఎల్లప్పుడూ నవ్వుతూ, నవ్వించే కొడుకు.... మిన్నువిరిగి మీద బడ్డా చలించని పుత్రుడు. ఊళ్ళో అందరి, ఆదరాభిమానాలు చూరగొని, ఊళ్ళో అందరికీ తలలో నాలుకలాగా మెదిలే... తన తనయుడు ఇంటి ముందు అరుగుపై కూర్చొని కాలక్షేపానికి కబుర్లు చెప్పినట్లు చెప్పుతున్నాడు. నిర్లక్ష్యంగా.

ఏమీ మార్పు లేని తన కుమారుని ధోరణి చూసి లోలోపల సంతోషిస్తూ....

"నీకన్నీ పరాచికాలేరా తండ్రీ – మేము నీ కోసం, "లబో, దిబోమని" ఏడుస్తూంటే నీకు అంతా నవ్వులాటగా ఉంది"... ఆమె పెదవులపై చిరునవ్వు.

ఇన్స్‌పెక్టర్ తన ముంజేతి వైపు చూసుకున్నాడు... ఇరువై రెండు నిముషాలు.

"అది సరేగానీ.... ఆ బుట్ట ఇటు తే... ఏం తెచ్చావ్?... కొడుక్కి.... అరడజన్ శేపులు (యాపిల్స్)... డజన్ అరటి పండ్లు... మొక్క జొన్న కంకులు... అంటూ లెక్కబెట్టి "రైట్"... అన్నీ ఇంటికి వాపస్ పట్టుకపో... ఇక్కడ డిటెన్యూలకొక పద్ధతి ఉంది.... ఎవరైనా చుట్టాలు, మిఠాయిలు, లడ్డూలు తెస్తే... అందరం కలిసి పంచుకొని తింటాం... దానిని "కమ్యూన్ లైఫ్ అంటారు".... మేం... పద్నాలుగు మందిమి.... మా బ్యారక్‌లో.... ఇవి అందరికీ చాలవ్... అందుకనీ వాపస్ తీసుకొనిపోండి... పిల్లలు తింటారు".

పొడి పొడి మాటలు – పొడి పొడి సంభాషణలు.

"నీకోసమనీ" అంత దూరం నుండి మోసుకొస్తే... వాపస్ తీసుకపోమ్మంటావేమిరా?.... అన్నీ అడ్డసుడి ముచ్చట్లు..."

"కోడలు పిల్ల అడిగినట్లు ఆ కాగితం ఏందో వ్రాసి ఇస్తే నీ ముల్లేం పోతుంది?"

ఆ ప్రశ్నకు సమాధానంగా మౌనం పాటించిన రాజు గోడపైనున్న గడియారం వంక చూశాడు... పెద్ద ముల్లు అయిదు దాటుతోంది... ఇంకా అయిదు నిమిషాలు...

"పాపం మీ తల్లిగారు అంత ప్రేమగా తెస్తే... వాపస్ తీసుకెళ్ళమంటారేం రాజుగారూ" అంటూ ఆ బుట్టలోని పండ్లని టేబుల్‌పై కుప్పబోసి ఖాళీ బుట్టను ఆమె చేతికందించాడు జైలర్. చివరి ఐదు నిమిషాలలో భార్య భర్తలిద్దరినీ స్వేచ్ఛగా మాట్లాడుకోవడానికి అవకాశం కల్పిస్తూ జెయిలర్, ఇన్స్‌పెక్టర్ తమ తమ కుర్చీల నుండి లేచి పక్కకు వెళ్లిపోయారు. పోతూ పోతూ టేబుల్‌పైనున్న యాపిల్స్‌లో నుండి చెరొకటి తీసుకొని పోయారు.

చివరి క్షణాలు...

స్తబ్ధంగా... క్రూరంగా ఉన్నాయి... మాటలు అన్నీ అయిపోయాయి.

భార్య చూపుల్లో... దుఃఖం... ప్రేమ... కోపం.

ఆమెను ఓదార్చలేని నిస్సహాయత... అనిర్వచనీయమైన భయం.

గోడపై గడియారం "టక్-టక్"... మంటూ తరిగిపోతున్న కాలాన్ని సూచిస్తున్న శబ్దం....

పువ్వులు తెంచుకున్న పిల్లల్ని వెంట బెట్టుకొచ్చిన చెక్రం ఆ పువ్వులను బుట్టలో సర్ది తల్లి చేతికి అందించాడు. ఇంకా ఒక్క నిమిషం.

"ఒరేయ్ బాబూ... నీవు నానమ్మ చేయి పట్టుకో.... బుజ్జీ... నీవు నా చేయి పట్టుకో పోదాం. అంటూ లేచి నిలబడింది. భుజంపై నుండి పమిటిచెంగు వక్షఃస్థలం పైకి లాక్కుంటూ.

"లేదు... నేను నాన్న చెయ్యి పట్టుకుంటా!... అంటూ జింకపిల్లలా ఎగురుటూ వచ్చి తన తండ్రి చేయి పట్టుకుంది... మారాము చేస్తూ...

"బుజ్జీ.... నేను రేపువస్తా... నా బంగారు తల్లివికదు!... అమ్మతో వెళ్ళు" తండ్రి చేతిని పట్టుకున్న ఆ చిన్నారి మంకు పట్టు పట్టి తన తండ్రిని ముందుకు నడిపించ సాగింది.

"మామూలు మాటలతో వినే రకం కాదిది"..... అయ్య కన్నా ఇది జగమొండి..." అంటూ తండ్రి నుండి తన బిడ్డను లాక్కొని ఒక చరుపు చరిచింది వీపుపై. బిడ్డను భుజానవేసుకొని గేటువైపు నడువసాగింది. ఏడుస్తూ గిలగిలా కొట్టుకుంటున్న బిడ్డను వక్షఃస్థలంపైకి లాక్కుంటూ, వెనుదిరిగి చూడకుండా పెద్ద పెద్ద అంగలు వేస్తూ ఇనుప చువ్వల గేటు దాటింది.

నాయనమ్మ చెయ్యి పట్టుకొని నడుస్తున్న పిల్లవాడు గేటు వద్దకు చేరి బిక్కు బిక్కు మంటూ వెనుదిరిగి వీడ్కోలు సంకేతంగా చెయ్యి ఊపుతూ గేటులో అడుగుపెట్టాడు.

తన వలన దెబ్బలు తిన్న బిడ్డను గూర్చిన ఆలోచనలతో నిలబడి గేటులో అడుగుపెట్టాడు.

జెయిలర్... ఇన్స్పెక్టర్, మళ్ళీ వచ్చి తమ తమ కుర్చీలలో కూలబడ్డారు. రిజిస్టర్‌లోకి తొంగిచూస్తూ...

"నెక్స్‌ట్... జంగారెడ్డి గారిని పిలుచుకొని రా... ఇటు ఈ బ్యారక్ అన్నాడు జెయిలర్.

"ఆయనేగా... మీసాలు" అంటూ రెండు చేతులతో తనకు లేని మీసాలు దువ్వుకుంటూ.

చక్రధర్... సిడబ్ల్యూ టోపీని సర్దుకున్నాడు.

**సేకరణ : "చినుకు" మాస పత్రిక అగష్టు 2008 నుండి**

**సంపాదకులు - నందూరి రాజగోపాల్**